నమస్తే తెలంగాణ
ఆదిలాబాద్ - నిర్మల్
5 | నిజామాబాద్ శనివారం 23 నవంబర్ 2024 | ADILABAD NIRMAL

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి జోగు రామన్న

అబద్ధాల చక్రవర్తి రేవంత్‌రెడ్డి

మహిళలను కోటీశ్వరులను చేస్తానంటూ మరోసారి మోసానికి యత్నం

- ఆరు గ్యారెంటీలిస్తామంటూ బీఆర్ఎస్ పథకాలను రద్దు చేశారు
- మాజీ మంత్రి జోగు రామన్న

ఆదిలాబాద్, నవంబర్ 22 (నమస్తే తెలంగాణ) : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అబద్ధాల చక్రవర్తిగా పేరుగాంచారని, కోట మంది మహిళలను కోటీశ్వరులను చేస్తామంటూ మరోసారి మోసం చేసేందుకు యత్నిస్తున్నాడని మాజీ మంత్రి, ఆదిలాబాద్ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు జోగు రామన్న ఆరోపించారు. శుక్రవారం బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సమయంలో మహిళలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళలకు మహాలక్ష్మి పథకంలో భాగంగా నెలకు రూ.2500, స్కూటీలు, తులం బంగారం, రూ. 4 వేల పింఛన్లు ఏమయ్యాయని ప్రశ్నించారు. రూ. 500 సిలిండర్ పూర్తి స్థాయిలో అమలు చేయడం లేదని, ఆహారం కలుషితం కారణం గా 40 మంది విద్యార్థులు చనిపోయారన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన కేసీఆర్ కిట్, న్యూట్రిషన్ కిట్, అమ్మఒడి పథకాలను ఎందుకు రద్దు చేశారని ప్రశ్నించారు. బతుకమ్మ చీరలు పంపిణీ అస్తవ్యస్తంగా మారిందన్నారు. నిరుద్యోగులకు ఒక్క నోటిఫికేషన్ జారీ చేయకుండా 50 వేల ఉద్యోగాలు ఇచ్చామని సీఎం ప్రకటించడం హాస్యాస్పదమన్నారు. ప్రజలను మోసం చేసిన సీఎం రేవంత్‌రెడ్డిపై ప్రైవేట్ కేసు పెడుతామని, ఇందుకోసం న్యాయవాదిని సంప్రదించినట్లు తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డిపై గతంలో జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేసినా, కేసు నమోదు చేయలేదన్నారు. ఈ సమావేశంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మెట్టు ప్రహ్లాద్, నాయకులు కుమ్ర రాజు, గంగయ్య, అశోక్ స్వామి, పందిరి భూమన్న, పండ్ల శ్రీనివాస్, ప్రకాశ్, సతీశ్, సృజన్, దయానంద్, వేణుగోపాల్, లక్ష్మణ్, అరవింద్ ఉన్నారు.

రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

మారుమూల గ్రామాలకు రోడ్ల నిర్మాణమే లక్ష్యం

బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

తలమడుగు, నవంబర్ 22 : మారుమూల గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పించడమే లక్ష్యమని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ తెలిపారు. మండలంలోని ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి పల్లి(బీ) గ్రామం వరకు రూ.2.33 కోట్లు, ఆర్ అండ్ బీ రోడ్డు నుంచి పల్లి(కే) గ్రామం వరకు రూ.2.33 కోట్లు బరంపూర్ నుంచి అర్లి(కే) గ్రామం వరకు రూ.2 కోట్లతో బీటీ రోడ్ల నిర్మాణానికి శుక్రవారం ముఖ్య అతిథిగా హాజరై భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. రోడ్డు నిర్మాణానికి కృషి చేసినందుకు ఎమ్మెల్యేకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గిరిజన గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పించేందుకు నిధుల మంజూరుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఎన్నో ఏండ్ల కలగా మిగిలిన రోడ్ల నిర్మాణానికి గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా

ప్రభుత్వ దవాఖానలో ప్రసవాలు జరిగేలా చూడాలి

ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా

ఎదులాపురం, నవంబర్ 22 :మెరుగైన వైద్య సేవలందించి, వంద శాతం ప్రసవాలు ప్రభుత్వ దవాఖానలో జరిగేలా చర్యలు తీసుకోవాలని వైద్య సిబ్బందిని ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన వైద్య, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులతో వివిధ అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యులు అందుబాటులో ఉండి ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలన్నారు. గర్భిణులకు ప్రైవేట్ దవాఖానలకు పంపించకుండా ప్రభుత్వ దవాఖానలోనే ప్రసవాలు జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆశ, ఏఎన్ఎం, అంగన్‌వాడీ టీచర్లు ఇంటింటికీ వెళ్లి గర్భిణులను రిజిస్ట్రేషన్ చేయించి వారికి పౌష్టికాహారం అందించి ప్రభుత్వ దవాఖానల్లో ప్రసవమయ్యేలా అవగాహన కల్పించాలని ఆదేశించారు. అనంతరం మెడికల్ ఆఫీసర్లను పీహెచ్‌సీల వారిని అడిగి తెలుసుకున్నారు.

చదువుతో పాటు స్కిల్స్‌లో నైపుణ్యం సాధించాలి

చదువుతో పాటు అదనంగా ఏదో ఒక రంగంలోని స్కిల్స్‌లో నైపుణ్యం సాధించి ఉపాధి అవకాశాలు పొందాలని యువతకు కలెక్టర్ రాజర్షి సూచించారు. నైపుణ్యం కేంద్రం ద్వారా నిరుద్యోగ యువతకు 3 నెలల పాటు ఉచిత శిక్షణ ఇచ్చారు. శుక్రవారం వైటీసీలో శిక్షణ పూర్తి చేస్తున్న వారికి సర్టిఫికెట్లను కలెక్టర్ అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ టైలరింగ్, కంప్యూటర్, సీసీ కెమెరాలు, మొబైల్ రిపేరింగ్, కంప్యూటర్ శిక్షణ, రిఫ్రిజ్‌రేటర్, ఎయిర్ కండీషనర్ రిపేరింగ్‌లో 3 నెలల పాటు ఇచ్చే శిక్షణను వినియోగించుకోవాలన్నారు. టైలరింగ్ నేర్చుకున్న సిబ్బంది డ్వాక్రా గ్రూపులో సభ్యులుగా చేరాలన్నారు. 120 మంది యువత శిక్షణ పొందినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీవైఎస్వో వెంకటేశ్వర్లు, డీడబ్ల్యూవో బీ సబిత, ఫ్యాకల్టీ, సిబ్బంది, ప్రిన్సిపాల్ రవీందర్, వైటీసీ ఇన్‌చార్జి బలరాం, లలిత, సాగర్, విశాల్, సునీల్, తదితరులు ఉన్నారు.

నిధుల్లేవ్.. పనుల్లేవ్

నిర్మల్ జిల్లాలో కుంటుపడుతున్న అభివృద్ధి

- సీడీపీ నిధుల ఊసే లేదు
- ఎస్‌డీఎఫ్ మంజూరైనా నయాపైసా విదిల్చలే..
- బీఆర్ఎస్ హయాంలో ప్రతి నెలా పట్టణ ప్రగతి కోసం రూ.80లక్షలు
- జనాభా ప్రాతిపదికన పంచాయతీలకు క్రమం తప్పకుండా నిధుల మంజూరు
- ఒక్క నిర్మల్ మున్సిపాలిటీకే పదేళ్లలో రూ.200 కోట్లు విడుదల చేసిన బీఆర్ఎస్ సర్కారు
- ప్రస్తుతం అనాథగా మారిన నిర్మల్ జిల్లా పట్టించుకోని పాలకులు

నిర్మల్ పట్టణం

నిర్మల్, నవంబర్ 22(నమస్తే తెలంగాణ): పదేళ్లలో ఎనలేని అభివృద్ధి సాధించిన నిర్మల్ జిల్లా.. ప్రస్తుతం నిధుల లేమితో కొట్టుమిట్టాడుతున్నది. పట్టించుకునే వారు లేక జిల్లాలో ప్రగతి పూర్తిగా కుంటుపడే పరిస్థితి నెలకొన్నది. ఈ ఆర్థిక సంవత్సరంలో కాంగ్రెస్ సర్కారు జిల్లా అభివృద్ధి కోసం నయా పైసా విడుదల చేయకపోవడంతో పనులన్నీ ప్రతిపాదనలకే పరిమితమవుతున్నాయి. బీఆర్ఎస్ హయాంలో జెట్ స్పీడ్‌తో దూసుకెళ్లిన జిల్లా.. ఇప్పుడు అభివృద్ధికి ఆమడ దూరంలో నిలిచిపోతున్నది. జిల్లాలోని మూడు నియోజకవర్గాల పరిధిలో మూడు మున్సిపాలిటీలు, 18 గ్రామపంచాయతీలు ఉన్నాయి. నిర్మల్, ముథోల్ నియోజకవర్గాలతో పాటు ఖానాపూర్ నియోజకవర్గం లోని 4 మండలాలు నిర్మల్ జిల్లా పరిధిలోకి వస్తాయి. ఆయా నియోజకవర్గాల పరిధిలో గతేడాదిగా ఎలాంటి అభివృద్ధి పనులు జరిగిన దాఖలాలు లేవు. కేసీఆర్ ప్రభుత్వంలో పల్లె ప్రగతి, పట్టణ ప్రగతి కార్యక్రమంలో భాగంగా అటు పంచాయతీలకు ఇటు మున్సిపాలిటీలకు ప్రతినెలా నిధులు మంజూరయ్యేవి. ఈ నిధులతో పారిశుధ్య పనులతో పాటు ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించేవారు. వీటితో పాటు నియోజకవర్గ అభివృద్ధి కార్యక్రమం (సీడీపీ) నిధులు, ప్రత్యేక అభివృద్ధి నిధులు (ఎస్‌డీఎఫ్) క్రమం తప్పకుండా విడుదలయ్యేవి. 2020-21 ఆర్థిక సంవత్సరం నుంచి 2023 జూన్ వరకు నియోజకవర్గానికి రూ.3 కోట్ల చొప్పున సీడీపీ నిధులను గత ప్రభుత్వం విడుదల చేసింది. నియోజకవర్గానికి రూ.10కోట్ల చొప్పున గతేడాది డిసెంబర్ వరకు ఎస్‌డీఎఫ్ నిధులను కేసీఆర్ ప్రభుత్వం క్రమం తప్పకుండా విడుదల చేసింది. ఈ నిధులతో నియోజకవర్గాల వారీగా రోడ్లు, వంతెనలు, మురుగు కాలువలు, ఇతర అభివృద్ధి పనులను చేపట్టేవారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గతేడాది కాలంగా ఆయా పథకాల కింద జిల్లాకు నయా పైసా మంజూరు కాలేదని చెబుతున్నారు. 2023 డిసెంబర్ తర్వాత ఇప్పటి వరకు 11 నెలల కాలంలో జిల్లా అభివృద్ధి కోసం కాంగ్రెస్ సర్కారు నయా పైసా విడుదల చేయకపోవడంపై ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఎస్‌డీఎఫ్ కింద నిధులు మంజూరయ్యాయని చెబుతున్నప్పటికీ.. పనులు చేసేందుకు కొందరు కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో ఎక్కడికక్కడ అభివృద్ధి పనులు నిలిచిపోయాయి. దీంతో ఎస్‌డీఎఫ్ నిధులను వినియోగించే పరిస్థితి కూడా లేకుండా పోయింది.

ఎస్‌డీఎఫ్‌కు పైసా రాలే..

ఈ ఏడాది స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్స్ (ఎస్‌డీఎఫ్) నయాపైసా విడుదల కాలేదు. జిల్లాలోని మూడు నియోజకవర్గాల ఎమ్మెల్యేలకు నామమాత్రంగా రూ.10 కోట్ల చొప్పున నిధులు మంజూరు మాత్రమే ఇచ్చారు. వీటికి సంబంధించి ఆయా శాఖల పరిధిలోని అధికారులు వివిధ పనుల కోసం ప్రతిపాదనలను సిద్ధం చేశారు. రోడ్లు భవనాల శాఖకు సంబంధించి నిర్మల్, ఖానాపూర్ నియోజకవర్గాల్లో ఎస్‌డీఎఫ్ కింద ఎలాంటి పనులు మంజూరు కాలేదు. కేవలం ముథోల్ నియోజకవర్గంలో రూ.2 కోట్ల పనులకు ఆమోదం లభించింది. భైంసా పట్టణంలో మురుగు కాలువల నిర్మాణంతో పాటు సీసీ రోడ్లు, దేగాం సమీపంలో ఓ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి ఈ నిధులను వెచ్చించనున్నారు. ఆయా పనులను చేపట్టేందుకు సైతం కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదని చెబుతున్నారు. పంచాయతీరాజ్ శాఖలో కూడా ఇదే పరిస్థితి ఉన్నది. మూడు నియోజకవర్గాల్లో కమ్యూనిటీ హాళ్లు, సీసీ రోడ్లు, మురుగు కాలువల కోసం ఆరు నెలల క్రితమే ప్రతిపాదనలు పంపారు. కొన్నింటికి ప్రభుత్వ ఆమోదం లభించినప్పటికీ పనులు మాత్రం పెద్దగా ముందుకు సాగడం లేదు. ఇప్పటికే చేసిన పనులకు సంబంధించిన బిల్లులు రాకపోవడంతో కొత్త పనులను చేపట్టేందుకు కాంట్రాక్టర్లు సైతం ముందుకు రావడం లేదు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుంచి సీడీపీ నిధులను సైతం విడుదల చేయలేదు. స్థానిక ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గ పరిధిలో ప్రజలకు ఉపయోగపడే అభివృద్ధి పనులకు తమ పరిధిలోనే నిధులు కేటాయించుకునేందుకు ఇవి ఉపయోగపడుతాయి. ఆర్థిక సంవత్సరంలో ఒక్కో నియోజకవర్గానికి రూ.3 కోట్ల సీడీపీ నిధులు ఉంటాయి. ఉమ్మడి రాష్ట్రంలో రూ. కోటి మాత్రమే ఉన్న నిధులను బీఆర్ఎస్ హయాంలో రూ.3 కోట్లకు పెంచారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత సీడీపీ నిధులను విడుదల చేయకపోవడంతో ప్రజల కనీస అవసరాలు తీర్చే పరిస్థితి లేకుండా పోయింది.

కుంటుపడుతున్న అభివృద్ధి...

ఎన్నికల వేళ ప్రజలకు అనేక హామీలను ఇచ్చి గెలిచిన ఎమ్మెల్యేలు ప్రస్తుతం ప్రజల్లోకి వెళ్లలేని పరిస్థితి నెలకొన్నది. ఎమ్మెల్యేల వద్ద నిధులు ఉంటే పలు రకాల అభివృద్ధి పనులను చేసే అవకాశం ఉంటుంది. ముఖ్యంగా తాగునీరు, రోడ్లు, డ్రైనేజీలు, పాఠశాలల్లో సదుపాయాలు, నూతన భవనాలు, ప్రహరీలు, కమ్యూనిటీ భవనాలు, కమిటీ హాళ్ల వంటి వాటికి నిధులు కేటాయించే అధికారం ఉంటుంది. ప్రభుత్వం నుంచి ఎలాంటి నిధులు రాకపోవడంతో ఏ పని కూడా చేసే పరిస్థితి లేకుండా పోయింది. దాంతో పల్లెలు, పట్టణాల్లో అభివృద్ధి కుంటుపడుతున్నది. ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. మొన్నటి వానకాలంలో భారీ వర్షాలకు చెడిపోయిన రోడ్లు, వంతెనలు, కల్వర్టులకు కనీసం మరమ్మతులు చేయించే పరిస్థితి లేదు. గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. పల్లెల్లో తాగునీటి సమస్య నెలకొన్నా పరిష్కరించేవారు లేరు. ఇకఎన్నికల సమయంలో ఎమ్మెల్యేలు ఇచ్చిన హామీల సంగతి దేవుడెరుగు.

నాడు వరదలా నిధులు..

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జిల్లాకు నిధులు వరదలా పారాయి. అప్పటి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు వెంటపడి మరీ నిధులను తీసుకొచ్చారు. సీడీపీతో పాటు ఎస్‌డీఎఫ్, టీయూఎఫ్ఐడీసీ నిధులను పెద్ద ఎత్తున విడుదల చేయించారు. అప్పటి మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డికి కేసీఆర్, కేటీఆర్‌తో ఉన్న చనువు కారణంగా జిల్లా కేంద్రంగా మారిన నిర్మల్‌కు పెద్ద ఎత్తున నిధులను తీసుకొచ్చారు. ఒక్క నిర్మల్ మున్సిపాలిటీకే పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో దాదాపు రూ.200 కోట్ల నిధులు మంజూరయ్యాయి. కొత్తగా ఖానాపూర్ మున్సిపాలిటీని ఏర్పాటు చేయడంతో అక్కడ కూడా అభివృద్ధి పనుల కోసం పెద్ద ఎత్తున నిధులు మంజూరయ్యాయి. పల్లె ప్రగతి, పట్టణ ప్రగతిలో భాగంగా జనాభా ప్రాతిపదికన ప్రతి నెలా పంచాయతీలు, మున్సిపాలిటీలకు నిధులు మంజూరయ్యేవి. నిర్మల్ మున్సిపాలిటీకి నెలనెలా రూ.82 లక్షలు నిధులు రావడంతో పట్టణంలో ఎప్పటికప్పుడు అవసరమైన పనులను చేపట్టే వారు. వీటితో పాటు మామడ మండలంలో సదర్మాట్ బ్యారేజీ నిర్మాణానికి రూ.500 కోట్లు, హైలెవెల్ కాలువ పరిధిలోని ప్యాకేజీ- 27 పనుల కోసం రూ.700 కోట్లు విడుదలయ్యాయి. నిర్మల్ సమీపంలోని వెల్మల్ బొప్పారం వద్ద రూ.1200 కోట్లతో 400 కేవీ సబ్ స్టేషన్ నిర్మాణం పూర్తి చేశారు. కలెక్టరేట్ నిర్మాణానికి రూ.175 కోట్లు వెచ్చించారు. జిల్లా వ్యాప్తంగా రోడ్లు, వంతెనల కోసం దాదాపు రూ.300 కోట్లకు పైగా నిధులు మంజూరయ్యాయి. ఇలా అన్ని రంగాలకు నాటి ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులను విడుదల చేయడంతో నిర్మల్ జిల్లా అభివృద్ధి పథంలో దూసుకుపోయింది.

ఇదేనా మార్పు..?

కాంగ్రెస్ పార్టీ ఆచరణ సాధ్యం కాని హామీలిచ్చి అధికారంలోకి వచ్చింది. కేవలం పది నెలల్లోనే విఫల ప్రభుత్వంగా పేరు తెచ్చుకున్నది. ఆరు గ్యారెంటీలపై ఎక్కడికక్కడ ప్రజలు నిలదీస్తున్నారు. కనీసం ఎమ్మెల్యేల నిధులను కూడా విడుదల చేయకపోవడం దారుణం. అభివృద్ధి ఎలా ముందుకు సాగుతుంది. ఒక్క పైసా విడుదల చేయకపోవడమేనా ప్రజా పాలనా..? కాంగ్రెస్ మార్పు అంటే ఇదేనా..? ఇందుకేనా ప్రజలు కాంగ్రెస్‌ను గెలిపించింది. నియోజకవర్గంలో కాంగ్రెస్ ఎమ్మెల్యే ఉండి ఏం లాభం..? వెంటనే అభివృద్ధి నిధులను విడుదల చేయించి పనులు చేపట్టాలి.

- భుక్యా జాన్సన్ నాయక్, బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి, ఖానాపూర్

జిల్లాలో అథ్లెటిక్స్‌కు పెరుగుతున్న ఆదరణ

జెండా ఊపి క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న పార్థసారథి

ఎదులాపురం, నవంబర్ 22 : గతంలో జిల్లాలో అథ్లెటిక్స్ పోటీలకు పది మంది కూడా రాకపోయేవారని ఇప్పుడు మాత్రం పెద్ద సంఖ్యలో పిల్లలు పోటీల్లో పాల్గొనడం సంతోషంగా ఉందని జిల్లా గిరిజన క్రీడలా భివృద్ధి అధికారి పార్థసారథి అన్నారు. అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో సబ్ జూనియర్ అథ్లెటిక్స్ ఎంపిక పోటీలను ఆయన ముఖ్య అతిథిగా హాజరై జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా చిన్నారుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. అనంతరం వీజీఎస్ అకాడమీ ఆధ్వర్యంలో క్రీడా పరికరాలను పంపిణీ చేశారు. అథ్లెటిక్స్‌లో రాష్ట్ర స్థాయిలో జిల్లాకు 9 చాంపియన్షిప్స్ వచ్చాయన్నారు. ఇందుకు కృషి చేసిన అథ్లెటిక్స్ కార్యదర్శి రాజేశ్‌ను అభినందించారు. అథ్లెటిక్స్ కార్యదర్శి రాజేశ్, పేట సంఘం కార్యదర్శి స్వామి, ఎస్ఎఫ్ కార్యదర్శి కాంతారావ్, లచ్చిరాం, అఖిలేశ్, సనాతన ఉత్సవ సమితి అధ్యక్షుడు ప్రమోద్ ఖత్రి ఉన్నారు.

ఆర్జీయూకేటీ అభివృద్ధికి సహకరించాలి

- విద్యార్థుల సంక్షేమమే ధ్యేయంగా ట్రిపుల్ ఐటీని దత్తత తీసుకున్న
- ఆత్మహత్యలు నివారించడమే లక్ష్యం
- నిర్మల్ ఎస్పీ జానకీ షర్మిల

బాసర ట్రిపుల్ ఐటీలోని స్టూడెంట్ యాక్టివిటీ భవనంలో విద్యార్థులతో నిర్మల్ ఎస్పీ జానకీ షర్మిల

బాసర, నవంబర్ 22 : బాసర ట్రిపుల్ఐటీ అభివృద్ధి, విద్యార్థుల సంక్షేమానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని నిర్మల్ ఎస్పీ జానకీ షర్మిల అన్నారు. శుక్రవారం ట్రిపుల్ఐటీలోని స్టూడెంట్ యాక్టివిటీ సెంటర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా ఆమె ట్రిపుల్ ఐటీని దత్తత తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆర్జీయూకేటీ అభివృద్ధి పథంలో సంపూర్ణ, సమగ్ర రక్షణ, విద్యార్థుల సంక్షేమానికి ఆర్జీయూకేటీని దత్తత తీసుకున్నామన్నారు. విద్యార్థులకు వారి లక్ష్యాలను సాధించడంలో వారికి అవసరమైన మద్దతు, మార్గదర్శకత్వం అందించేందుకు కట్టుబడి ఉన్నానని తెలిపారు. విద్యార్థుల్లో బాధ్యత, సమాజ సేవా భావాన్ని పెంపొందించేందుకు అధ్యాపకులు కృషి చేయాలన్నారు. అనంతరం వీసీ గోవర్ధన్ మాట్లాడుతూ ట్రిపుల్ఐటీని ఎస్పీ దత్తత తీసుకోవడం వారి ఉదారమైన స్వభావానికి ధన్యవాదాలని, విద్యార్థులకు అందించిన సమయానికి కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య, ఆరోగ్య సంరక్షణ, పాఠ్యేతర కార్యకలాపాలకు అందించడమే లక్ష్యంగా కలిసి పని చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ అవినాష్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ రణధీర్ సాగి, అసోసియేట్ డీన్, స్టూడెంట్ వెల్ఫేర్ నాగరాజు, అధికారులు, అధ్యాపకులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్జేయూకేటీలో ఆత్మహత్యలు నివారిద్దాం

నిర్మల్ అర్బన్, నవంబర్ 22 : జాతీయ దత్తత దినోత్సవం(నవంబర్ 23)ను పురస్కరించుకుని బాసర ట్రిపుల్ ఐటీ కళాశాలను దత్తత తీసుకుంటున్నట్లు నిర్మల్ జిల్లా ఎస్పీ జానకీ షర్మిల ప్రకటనలో తెలిపారు. బాసర ట్రిపుల్ ఐటీని ఆత్మహత్యలు లేని యూనివర్సిటీగా తీర్చిదిద్దాలని తెలిపారు. విద్యార్థుల లక్ష్యాలను నెరవేర్చుకునేలా జయకేతనం ఎగురవేద్దామని పిలుపునిచ్చారు. ఆత్మహత్యలు లేని యూనివర్సిటీగా తీర్చిదిద్దేందుకు జిల్లా పోలీసులు ఎల్లప్పుడూ ముందున్నారని తెలిపారు. విద్యార్థులకు ఏవైనా సమస్యలుంటే నేరుగా జిల్లా ఎస్పీ కార్యాలయానికి వచ్చి తెలుపవచ్చని సూచించారు.

ఇద్దరు బాలసదన్ ఉద్యోగులపై వేటు

ఎదులాపురం, నవంబర్ 22: విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఇద్దరు బాలసదన్ ఉద్యోగులపై వేటు పడింది. అవుట్‌సోర్సింగ్‌లో హౌస్ మాస్టర్‌గా విధులు నిర్వహిస్తున్న మర్సుకోల సుశీలను ఉద్యోగం నుంచి తొలగించగా, రెగ్యులర్ ఉద్యోగి అయిన వంట మనిషి కమలాబాయిని మహిళ, శిశు సంక్షేమ శాఖ డీడీకి సరెండర్ చేస్తూ ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా శుక్రవారం ఆదేశించారు. ఈ నెల 19న నిర్మల్ జిల్లాకు చెందిన బాధితురాలు ఆదిలాబాద్ పట్టణంలోని బాలసదనానికి రాగా ఆమెను చేర్పించుకోలేదు. దీంతో బాధితురాలు తిరిగి నిర్మల్ జిల్లాకు వెళ్లిపోయింది. ఈ విషయంపై ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల డీఎల్ఎస్ఏ కార్యదర్శులకు ఫోన్ ద్వారా బాధితురాలు తెలిపింది. ఈ నెల 20న సీనియర్ సివిల్ జడ్జి, డీఎల్ఎస్ఏ కార్యదర్శి బోనగిరి సౌజన్య బాలసదన్‌కు వెళ్లి తనిఖీ చేశారు. బాధితురాలికి బాలసదనంలో ఎందుకు చేర్పించుకోలేదని ఆరా తీశారు. విధులపై నిర్లక్ష్యంగా వ్యవహరించిన వంట మనిషి కమలాబాయితో పాటు నైట్‌వాచ్ ఉమెన్ మాయబాయికి అదే రోజు మెమోలు జారీ చేశారు. ఈ విషయంలో జిల్లా డీఎల్ఎస్ఏ కార్యదర్శి బీ సౌజన్య కలెక్టర్, హైదరాబాద్ ఉన్నత అధికారులకు సమాచారం అందించి నివేదికను పంపించారు. ఈ మేరకు వంట మనిషి కమలాబాయిను మహిళ, శిశు సంక్షేమ శాఖ డీడీకి సరెండర్ చేయాలని, అవుట్‌సోర్సింగ్ విధానంలో హౌస్ మదర్‌గా పనిచేస్తున్న మర్సుకోల సుశీలను విధులనుంచి తొలగించాలని కలెక్టర్ ఆదేశించారు. సుశీల రెండు నెలల నుంచి ఎలాంటి సమాచారం ఇవ్వకుండా బాలసదన్‌కు రావడం లేదని జిల్లా సంక్షేమ శాఖ అధికారి బీ సబిత తెలిపారు.

గర్భస్థ మహిళల మరణాలను అరికట్టాలి

నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్

సమావేశంలో మాట్లాడుతున్న నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్ చైన్‌గేట్, నవంబర్, 22 : గర్భస్థ మహిళల మరణాలను అరికట్టేందుకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని వైద్య, ఆరోగ్య శాఖల అధికారులు, సిబ్బందిని నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్ ఆదేశించారు. గర్భస్థ మరణాలు నివారించడంపై శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో వైద్య శాఖ అధికారులతో ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో గర్భస్థ మహిళల మరణాలు నియంత్రించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఇప్పటికే గర్భస్థ మహిళల మరణాలను నియంత్రించేందుకు జిల్లా కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సమావేశంలో డీఎంహెచ్‌వో రాజేందర్, వైద్యాధికారులు సురేశ్, శ్రీనివాస్, సౌమ్య, అధికారులు ఉన్నారు.

విజ్ఞానవంతులు కావాలి

నిర్మల్ అర్బన్, నవంబర్ 22 : గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకుని విజ్ఞానవంతులు కావాలని యువతకు నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్ సూచించారు. శుక్రవారం నిర్మల్ పట్టణంలోని జిల్లా గ్రంథాలయాన్ని ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా గ్రంథాలయంలో వివిధ పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే అభ్యర్థులకు అన్ని రకాల పుస్తకాలను అందుబాటులో ఉంచి, వసతులు కల్పించాలన్నారు. సమయపాలన పాటిస్తూ ప్రణాళిక ప్రకారం చదవాలని పోటీ పరీక్షల అభ్యర్థులకు సూచించారు. ఆమె వెంట నిర్మల్ గ్రంథాలయ సంస్థ చైర్మన్ సయ్యద్ అర్జుమంద్ అలీ, తహసీల్దార్ రాజు అధికారులు మోహన్ సింగ్, విజయశ్రీ, సిబ్బంది పాల్గొన్నారు.